# తొలివలపు

**పురుషులకు ప్రత్యేకం**

—కాశీనాధుని త్రిశూలపాణి

"అమ్మాయి బాలా!... త్రిపుర వచ్చింది" అన్నారు నాన్న. చికాకుగా ఉన్న నామనసు తేలిక పడింది. ఏవేవో ఆలోచనలు గాలితాకిడికి దూది పింజ ల్లా చెల్లా చెదరయ్యాయి. పుస్తకం ప్రక్కన ఉంచి త్రిపుర కోసం ఎదురు చూస్తున్నంతలో భారంగా అడుగులు వేస్తూ గదిలోకి వచ్చింది త్రిపుర. ఎండలో పడి వచ్చి నట్లుంది. ముకుళించుకు పోయిన పద్మంలా వడ గాల్పుకు కంది పోయింది. తేరుకునేలోగా క్రిందికి వెళ్ళి చల్లని మజ్జిగ తెచ్చాను.

"ఏమే, వెన్నెల బాగా ఉందనా విహారానికి బయల్దే రావు?" అన్నాను నేనూ మజ్జిగ తాగుతూ.

"నాకు అదొక్కటే తక్కువ" అంది తన సహజ ధోరణిలో నిట్టూరుస్తూ.

సమాధానం విని కొద్దిగా బాధ పడ్డాను. త్రిపుర సాధారణంగా ఏదైనా ముఖ్యమైన పని వుంటేనే గాని ఇల్లు కదలదు. అలాంటిది ఇంత ఎండ వేళ ఇల్లు కదిలింఁచంటే ఏదో కారణం ఉండాలి.

"కాలేజీకి వెడుతున్నాను. నువ్వుకూడా తోడు వస్తావే మోనని వచ్చాను" అంది త్రిపుర.

"ఇంత మండుటెండలో ఇప్పుడు కాలేజీకి వెళ్ళ వలసిన అగత్యం ఏమిటో?" అన్నాను.

"మాథ్స్‌లో రెండు ప్రాబ్లెమ్స్ ఎంత ప్రయత్నించినా సాల్వ్ చెయ్యలేకపోతున్నాను. మేష్టారిని అడుగు దామని" అంది.

"నిజంగా ప్రాబ్లెమ్స్ అడగటానికా?...లేక మేష్టారికి ప్రాబ్లమ్స్......" అనేశాను అప్రయత్నంగా నవ్వుతూ.

త్రిపురకు నేను ఊహించినట్లు కోపం రాలేదు. నవ్వింది. ఎఱ్ఱగా సిగ్గుతో కందిపోయింది. ఆ నవ్వులో చిట్లించిన కళ్ళ వెనక ఎన్నో అంతులేని నీడలు. వాటి ఛాయలు ఊహాతీతం.

త్రిపుర స్వభావం చాలా నిర్మలం, సున్నితమూను. దాన్ని నిరుత్సాహపరచడం ఇష్టం లేక, నేను ప్రయత్ని స్తున్న ప్రాబ్లెమ్ తనను ప్రయత్నించమని చెప్పి కాలేజీకి వెళ్ళడానికి తయారు కావడంలో నిమగ్నమయ్యాను. నేను రెడీ అయ్యేలోగా అది నా ప్రాబ్లెమ్స్ చెయ్యడం పూర్తి అయిపోయింది. త్రిపుర స్వతహాగా తెలివైనది. ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంవల్ల చదువు విలువ బాగా తెలుసు. చదువుపై మొదటి నుంచీ శ్రద్ధ చూపుతూ వచ్చింది. ఎప్పుడూ మంచి రాంకులో మార్కులు సంపాయిస్తూ వచ్చింది.

మేము కాలేజీకి చేరేటప్పటికి ఎండ తీవ్రంగానే ఉంది.

"బాలా! మన పరీక్షలు ఈ నెలాఖరుకు అయిపోతాయి. ఆపై నెలారంభంలో రిజల్ట్స్ వస్తాయి" అంది త్రిపుర. ఉలిక్కి పడి చూశాను. నేను పూర్తి చెయ్య వలసిన కోర్సు చాలా ఉండిపోయింది. పరీక్షలు దగ్గర పడుతున్న కొద్దీ నేను భయపడి ఛస్తూంటే, "పరీక్షలు ఎప్పుడు అయిపోతాయా? ఫలితాలు ఎప్పుడొస్తాయా?" అని త్రిపురకు తహతహ.

మేం ఇద్దరం మాథ్స్ లెక్చరర్ నిరంజన్ రావు గారి గది గుమ్మం దగ్గర నిలబడ్డాం. ఆయన మా వైపు చూస్తారనే. పది, పదిహేను నిమిషాలు గడిచిపోయింది. సిగరెట్టు వెంబడే సిగరెట్టు ముట్టిస్తూ దీర్ఘలోచనలో మునిగి పోయారాయన.

చిన్నగా గొంతు సవరించుకుంటూ దగ్గింది త్రిపుర. ఉలిక్కిపడి, మా వంక చూసి "రండి" అంటూ పిలి చారు కంగారు పడుతూ. ఆయన కంగారు చూస్తుంటే నాకు నవ్వొచ్చింది.

త్రిపుర మేథ్స్ రెండు ప్రాబ్లెమ్స్ ఎలా చెయ్యాలో తెలియడం లేదండీ. ఆయన చెప్పడంలో లీనమై పోయారు వెంటనే. త్రిపుర ఆయన చెప్పింది అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తూంది.


మాథ్స్‌లో మెదలయిన త్రిపుర సంశయాలు తక్కిన విషయాలవైపు మళ్ళాయి.

సుమారు రెండు గంటలు గడిచిం తరువాత "చాలా! ఇంక వెడదామా?, అని త్రిపుర మాష్టారు దగ్గర సెలవు తీసుకుని బయల్దేరాము.

మాథ్స్ లెక్చరర్ నిరంజన్‌రావు గారి వయస్సు సుమారు పాతిక. ప్రకాశవంతమైన కళ్ళు వర్చస్సుతో, ఆకర్షణీ'యం గా ఉంటాడంటే అతిశయోక్తి లేదు.

యూనివర్సిటీ గోల్డు మెడలిస్ట్‌గా వచ్చిన నిరంజన్ సుమారు సంవత్సరం క్రిందట మా కాలేజీలో లెక్చరర్‌గా చేరారు.

ఎప్పుడూ ఆయన ఏదో కోల్పోయినట్లు శూన్యంలోకి చూస్తూండే వారు పరధ్యానంగా ఉన్నట్లుగా. ఇది కనిపె ట్టిన విద్యార్థులు ఆయనకు చేసిన నామకరణం 'పిచ్చి



మారాజు.' అల్లరి పెడదామని విద్యార్థులు ఎన్ని విధాల ట్రైచేసినా తనను కానట్లు ప్రవర్తించేవాడు.

కానీ రోజులు గడిచిన కొద్దీ ఆయన మంచితనమూ—సబ్జక్ట్‌లో ఉన్న ప్రావీణ్యంతో క్లాసులో ప్రతి ఒక్కరికీ ఆకారణంగా తన ప్రత్యేకతను రుజువు చేసుకొన్నారు.

* * *

వరండాలో నిలబడి ప్రకృతి సౌందర్యాన్ని తిలకిస్తున్నాను. సూర్యుడు అస్తమించబోతూ కూడా సృష్టిని రాగరంజితం చేస్తున్నాడు. వింత వింత రంగులు దోబూచులాడుతున్నాయి. ప్రకృతి వైవిధ్యాన్ని పైనున్న మేఘాలు కునుకుతో చూస్తున్నాయి.

త్రిపుర దగ్గరి కొచ్చినా నేనదే కోణంలో చుస్తూ ఉండిపోవటం త్రిపురకి తమాషాగా ఉంది. "ఏయ్ మొద్దూ.... అలా నది ఒడ్డుకు షికార్‌కు వెళ్దామా?" అన్నది త్రిపుర కొంటెగా.

ఎదురు చూడని సమాధానం నన్ను ఆశ్చర్యంలో సతమతం చేసింది. అలా నది ఒడ్డుకు వెళ్ళిన సందర్భాలు చాలా అరుదు. అలా వెళ్ళిన సమయాల్లో ఏదో గొప్ప సంతోషమో, పరీక్షలు పాసయినప్పుడో అమ్మ కొత్త చీర కొన్నప్పుడో అలా వెళుతూ ఉండే వాళ్ళం.

నేను మారు మాట్లాడక త్రిపురని అనుసరించాను. ఇద్దరం నిర్జన తీరాన చేరి దగ్గరగా ఉన్న పచ్చికలో కూర్చున్నాం. ఆ ప్రశాంత వాతావరణంలో తీర్చిన రంగు బొమ్మల్లా పచ్చటి పచ్చికలో కొట్టొచ్చినట్లు ఉన్నాం ఇద్దరం. ఆకాశాన్ని అరువు తెచ్చుకున్న రంగులతో ప్రవహించే స్తోంది నది. పలకరించి పోతున్న సంధ్యగాలి మదురానుభూతులను రేకెత్తిస్తోంది. నీరెండ నీటిపై పడి వెండి జలతారులా అక్కడక్కడా మెరుస్తున్నాయి. దూరాన పోతున్న నావ, మసక నీడలో కూని దీర్ఘాలు లయ ర్ఘంజితంగానే వినిపిస్తున్నాయి.

"నీతో ఒక ముఖ్య విషయం చెప్పాలని నిన్నిక్కడకు పిల్చా, బాలా!" కాలి బొటని వేలుతో చీరకుచ్చిళ్ళు సర్దుతూ అన్నది త్రిపుర.

త్రిపుర వైపు చూశాను. నాకా సమయంలో త్రిపుర పసిపిల్ల లాగానే కనిపించింది. ఇసుకలో ఏవో గూళ్ళు కడుతూ మరేవో చెబు తూంది.

"అవును. ఏదో విశేషముంటే గానీ మనం ఇక్కడికి రామన్న విషయం మనిద్దరికీ బాగా తెలుసు." అన్నాను త్రిపుర కళ్ళలోకి చూస్తూ.

"ఎలా చెప్పాలో అర్థం కావడంలేదు" సతమతమవుతూ ఇబ్బందిగానే అంది త్రిపుర.

"నాదగ్గర సిగ్గెందుకు? రహస్యం అయితే చెప్పొద్దు."

"అదేవిటి బాలా....... నీదగ్గర నాకు రహస్యాలు ఏం ఉంటాయి?" అంటూ మెల్లగా చెప్పటం మొదలు పెట్టింది.

"నిన్నరాత్రి అనుకోని సంఘటన ఒకటి జరిగింది. ఆరోజు రాత్రి పన్నెండు గంటలైంది. టీ త్రాగి ముందు గదిలో కూర్చుని కెమిస్ట్రీ రికార్డ్‌లో బొమ్మలు వేస్తున్నాను. బజారంతా నిర్మానుష్యంగా ఉంది. అమ్మ వెనుక గదిలో బాగా నిద్రపోతోంది. ఎవరో తలుపు తట్టారు. ఉలిక్కిపడి పక్క వాళ్ళింటికి ఎవరో వచ్చి ఉంటారని నాకు నేను సంజాయిషీ ఇచ్చుకుని, నా పనిలో మునిగిపోయాను. కాస్సేపైంతరువాత మళ్ళీ తలుపు తట్టిన శబ్దం వినబడ్డంతో అదిరి పడ్డాను. గుండె చాలా వేగంగా కొట్టుకోసాగింది. గొంతులో మాట పెగిలి రావటంలేదు ఎవర్నైనా పిలుద్దామంటె.

"అర్థరాత్రి మాఇంటికి వచ్చేవాళ్ళెవరుంటారు" అని సంశయించాను. ఒకవేళ వాడు దొంగ అయితే దోచుకోడానికి ఏమీ దొరకవు మా యింట్లో నిద్రపోతున్న అమ్మని లేపడానికి ధైర్యం చాల్లేదు. ప్రాణాన్నంతా కూడట్టుకుని తలుపు దగ్గరకు వెళ్ళాను. బయట్నించి 'త్రిపుర త్రిపుర' అన్న గొంతు వినిపించింది. మొండి ధైర్యంతో తలుపు నెమ్మదిగా తెరిచాను. గుమ్మంలో నిలబడ్డ వ్యక్తిని చూడగానే నోటమాటరాలేదు. ఎవరో నువ్వూహించగలవా? మన నిరంజన్ మాష్టారు గారు. జుట్టంత చెదరిన ఆయన అమాయకపు ముఖం చూడగానే నన్ను నవ్వులపాలు, వీధిపాలు చెయ్యరని అనిపించి నేను మౌనంగా నిలబడ్డాను. కొద్ది క్షణాలు మా ఇద్దరి మధ్య నిశ్శబ్దం.
మాట్లాడక వెనుతిరిగి వడివడిగా వెళ్ళిపోయారు. మేలుకొనేకలగంటున్నానేమో, లేదా నిజమా! అన్నట్లు దిగ్భ్రాంతురాలయ్యాను. ఆయన వెళ్ళిన వైపే వింతగా చూస్తుండిపోయాను. గభాలున తలుపువేసి పరుగున లోపలికి వచ్చేసి ఓచోట కూర్చుండి పోయాను నిశ్చలంగా.

"ఆయన అర్థరాత్రి రావటం ఎవరన్నా చూసివుంటే ఏ విపరీతార్థాలకు, అభాండాలకు దారి తీసిఉండేదో అనుకున్నాను. నాకిదంతా అయోమయంగా ఉంది బాలా! అంది త్రిపుర.

త్రిపుర, నిరంజన్ మాష్టార్ని ప్రేమిస్తున్నదని తెలుసు. ఆయనను చూడగానే త్రిపుర ముఖం అరుణ వర్ణం ధరిస్తుందని, దాని మనస్సు స్వప్నాల్లో విహరిస్తుందని తెలుసు.

బాగా చదివే వారంటే లెక్చరర్లకు అభిమానం, అనురాగం ఉండటం సహజం. ఇంతవరకూ నేనలానే ఊహించాను త్రిపుర విషయంలో. కాని ప్రేమలో పడ్డారని అనుకోలేదు.

ఒకరి సుఖసంతోషాలతో పాలుపంచుకోడం ఆనందదాయకమైనదే. అంధకారంలో ప్రయాణిస్తున్న దాని జీవితంలో వెలుగు ఉదయిస్తే ఎవరికి మాత్రం చూడ ముచ్చటగా ఉండదు? నిరంజన్ మాష్టారు త్రిపురకి అన్ని విధాలా తగినవారు. వాళ్ళ దాంపత్యం పూవుకు తావబ్బినట్లే ఉంటుంది. నిరంజన్ మాష్టారిని వివాహం చేసుకుంటానంటె పిన్ని ఏమాత్రం అభ్యంతరం చెప్పదు. పిన్ని కూతురికి అంతకన్నా మంచి సంబంధం తేలేక పోవడం వల్లనే కావచ్చు. ప్రేమవివాహాలు అరుదుగా చూస్తాము. అవివాళ్ళు చేసుకున్న పూర్వజన్మ సుకృతాలే.

"త్రిపురా! నువ్వు చాలా అదృష్టవంతురాలివి!" అన్నాను నీటి తరంగాలను చూస్తూ.

కొద్ది క్షణాలు త్రిపుర మాట్లాడలేదు. అంతులేని సంతోషంవల్ల కావచ్చు. నేను ఆలోచిస్తూకూర్చున్నాను.

"బాలా!... నాకు ఏం చెయ్యాలో తోచడం లేదు. అమ్మతో చెప్తే?" అంది త్రిపుర అమాయకంగా.

త్రిపురవైపు నిశితంగా చూశాను. సిగ్గుతో తల వంచుకుని ఇసుకలో ఏవో పిచ్చిగీతలు గీస్తున్నది.

"పిన్నితో అప్పుడే చెప్పవద్దుసుమా! ఈ నెలాఖరుకు మన పరీక్షలు అయిపోతాయి. ఈ సమయంలో మనస్సు వేరొక దానిపై లగ్నం చెయ్యడం మంచిది కాదని తోస్తోంది. మూడు సంవత్సరాలు కష్టపడి చదివిన దానికి ఫలితం ఉండదు. ఇంతకాలం ఓపికపట్టిన నీకు ఈ కొద్ది రోజులూ ఓపిక పట్టడం ఏమాత్రం కష్టంకాదు. పిన్ని ఈ వివాహానికి ఎంతమాత్రమూ అభ్యంతరం చెప్పదు. మన పరీక్షలయ్యాక నాన్నగారితోను, పిన్నితోను కూడా చెప్పవచ్చు. నాన్నగారు మాష్టారితో మాట్లాడతారు" అన్నాను.

"నువ్వన్నది నిజం బాలా!" అంది త్రిపుర మనస్సు తేలికపర్చుకుని, కొంతసేపు కాలేజీకబుర్లలో, పడ్డాము. రాబోయే పరీక్షలను గురించి ముచ్చటించుకున్నాము.

* * * *

త్రిపుర మొదటి ప్రాక్టికల్ ముగించి రెండవది మొదలు పెట్టింది.

మాకు కొన్ని గజాల దూరంలో కెమిస్ట్రీ మాష్టారుగారు పై ఊరి నుండి వచ్చిన ఎగ్జామినర్, డిమాన్‌స్ట్రేటర్లు కుర్చీలో కూర్చుని ఏవోకబుర్లు చెప్పుకుంటున్నారు. చివరకు వాళ్ళ సంభాషణ గతరాత్రి జరిగిన విషాద సంఘటన మీదకు మళ్ళింది.

"అతను నా స్నేహితుడు కోదండ రామయ్యకొడుకు. అతని చిన్న తనంనుంచీ నాకు తెలుసు. ఎంత తెలివైన వాడో అంత అమాయకుడు కూడా. అతనికి వాళ్ళ నాన్న మిగిల్చి ఇచ్చిన ఆస్తి లేదు. చిన్నతనం నుంచీ దారిద్ర్యంతో యమ యాతన అనుభవించాడు. అష్టకష్టాలు పడ్డాడు. ఆ తరువాత ఏదో వృద్ధిలోకి వచ్చాడని, సంపాదించుకుంటున్నాడని ఆనందించాను. కానీ అతనికీ నడమంత్రపు చావు ఇంతచిన్న వయసులో దాపురిస్తుందని అనుకోలేదు. ఆత్మహత్య చేసుకున్నాడా, అంటే అందుకు ఆధారాలు దొరకలేదు. లేవుకూడా. నిజంగా అంతటి పిరికి వాడయివుంటే ఈ పాటికెప్పుడో ప్రాణాలు తీసుకునే వుండేవాడు.

"ఈ మధ్య అతని ప్రవర్తన నాకు వింతగా తోస్తున్నది. అప్పుడప్పుడు అర్థరాత్రివేళ మా యింటికి వచ్చి తలుపు తట్టేవాడు. ఇంత రాత్రివేళ వచ్చాడు, ఏదైనా ముఖ్యమైన పనివుందీ అంటే, ఏదో తనలో తను మాట్లాడుకుంటూ ఎలా వచ్చాడో అలా తిరిగి వెళ్ళిపోయేవాడు. అతని మాటలు నాకు అర్థం అయ్యేవికావు. నాకు అనుమానం వేసేది. అతను "సోమ్నామ్ బులిజమ్' తో బాధపడటం లేదుకదా" - అనుకున్నాను."

"అంటే అదేంటి మాష్టారూ" అన్నాడు డిమాన్‌స్ట్రేటరు కృష్ణమూర్తి.

"అదొక వింత మానసిక వ్యాధి. ఆ జబ్బుతో ఉన్న వాళ్ళు రాత్రివేళ లేచి నిద్రలో నడుస్తారు. ఏంజరుగుతున్నదో తామేం చేస్తున్నామో వాళ్ళకు తెలియనట్లు ప్రవర్తిస్తారు. ఆ సమయంలో వాళ్ళు కాన్షస్‌లో ఉండరు కొందరు నడుస్తారు. ఇంకొందరు ఎంతటి ధైర్యసాహసాలతో కూడిన పనులైనా సులువుగా చేసేసి మారు మాట్లాడక పడుకుంటారు. తెల్లవారిన తరువాత "రాత్రి నువ్విలా ప్రవర్తించావు" అంటే నమ్మరు. నాకు అనిపిస్తుంది.... ఇంత మంచివాళ్ళకు అలాంటి వింత జబ్బులెందుకు పెడతాడో భగవంతుడని. నిండుగా ముప్ఫై ఏళ్ళైనాలేవు. అప్పుడే అతని జీవితం ముగిసింది" అన్నారు రామారావు మాష్టారు బాధతో నిండిన స్వరంతో

"ఎవరి గురించి మాష్టారూ ఇంతసేపూ చెప్తున్నది?" అన్నారు పై వూరు నుంచి వచ్చిన ఎగ్జామినర్.

"ఇక్కడి మాథ్స్ లెక్చరర్ నిరంజన్‌రావు నిన్నరాత్రి రైల్వేలైను మధ్యగా నడుస్తూ, రైలు క్రిందపడి మరణించాడు" అన్నారు హీనస్వరంతో రామారావుగారు.

ఇది విన్న త్రిపుర చేతిలోని ఏసిడ్ సీసా నేలకూలి సహస్ర ముక్కలైంది. 'మాష్టారు' అంటూ కుప్పకూలిపోయింది త్రిపుర... □

చాలామందికి పదమూడో నెంబర్ అంటే మహాభయం. కాని ఇటలీలోని వారికి అది అత్యంత అదృష్టకరమైన సంఖ్య.

నేతి బీరకాయలో నెయ్యి లేనట్టే సోడా నీటిలో సోడా వుండదు.